క్లుప్తంగా

అంటువ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వెదురుకుప్పం: అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య సిబ్బంది అన్నారు. శనివారం మండలంలోని చింతలగుంట ఎస్సీ కాలనీలో అంటు వ్యాధులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అపరిశుభ్రత కారణంగా అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందన్నారు. నివాసాల వద్ద పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా కాచి చల్లార్చి, వడపోసిన నీటిని తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా విష జ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం పలువురికి వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు.

పశువులకు వ్యాధి నివారణ చర్యలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి సంధ్యసౌందర్య అన్నారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు తప్పని సరిగా టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేసుకోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఆవులకు పాల దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగకారడం, కుంటడం తదితర లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్య సేవలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ఊరేగింపు ఉత్సవాలు



ఊరేగింపుగా వస్తున్న పొన్నియమ్మ దేవత

నగరి: మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో పొన్నియమ్మ దేవత ఊరేగింపు ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అత్యంత అద్భుతంగా అలంకరించిన గుర్రపు రథంపై ప్రధాన వీధుల్లో అమ్మవారిని ఊరేగింపుగా తీసుకురాగా గ్రామస్తులు కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులు పట్టి దర్శించుకున్నారు. ఊరేగింపు ఆద్యంతం బాణాసంచా వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రేపటి నుంచి పశువులకు టీకాలు

వెదురుకుప్పం: జాతీయ గాలి కుంటు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మండలంలోని పశువులకు సోమవారం నుంచి టీకాలు వేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రూపసుందరి తెలిపారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 16 వేల పశువులు ఉన్నట్లు చెప్పారు. పశువైద్య కేంద్రాలలో గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధితో పుండ్లు, జ్వరం, పాల దిగుబడి తగ్గడం, నీరసం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. టీకాలు వేయించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోక్ అదాలత్‌లో 73 కేసులు పరిష్కారం

నగరి: స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 73 కేసులు పరిష్కారం కాగా రూ.22,79,210 సెటిల్‌మెంట్ జరిగింది. నగరి ఇన్‌చార్జి జడ్జి సి.జానకి సమక్షంలో నిర్వహించిన ఈ లోక్ అదాలత్‌లో సీటీ కేసులు 2, సీసీ ఐపీసీ, సీసీ ఎక్సైజ్, ఎస్‌టీసీ కేసులు 16, బ్యాంకు కేసులు 13, ఎస్‌టీసీ కేసులు మొత్తం 73 పరిష్కారమయ్యాయి. సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, బ్యాంకు మేనేజర్లు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

పుత్తూరు: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ తిరుమలరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్‌తోపాటు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, యోగా, చెస్, బ్యాడ్మింటన్ పోటీలు అండర్-14, అండర్-17 బాలబాలికలకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

నిత్యాన్నదానానికి విరాళం

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం అన్నదాన ట్రస్టుకు శనివారం ఓ దాత నగదు విరాళం చేశారు. ఐరాల మండలం అగరంపల్లికి చెందిన ప్రసాద్‌రెడ్డి రూ.లక్ష నగదు ఆలయ అధికారులకు అందజేశారు. దాతకు ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈఓ పెంచల కిషోర్, సిబ్బంది వాసు, బాలాజీనాయుడు రులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరం

- రోడ్లు, డ్రైనేజీలు లేక గ్రామస్తుల అవస్థలు
- 900 కుటుంబాలున్న కేబీఆర్‌పురం పంచాయతీ
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శి
- పాలకమండలి సభ్యుల ఆరోపణలు



కేబీఆర్‌పురం దళితవాడ రోడ్డుపైనే నిలిచిన నీరు, (ఇన్‌సెట్) డ్రైనేజీ లేక ముందుకు సాగని మురుగు

పుత్తూరు: రూరల్ మండలంలో కేబీఆర్‌పురం పంచాయతీ అతిపెద్ద పంచాయతీ. అయితే పంచాయతీ పరిధిలోని గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. ప్రస్తుతం ఇక్కడ ఎస్టీ కమ్యూనిటీకి చెందిన మహిళ జయమ్మ గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు. కేబీఆర్‌పురం గ్రామంలో 250 కుటుంబాలు ఉండగా, దళితవాడలో 200 కుటుంబాలు, గిరిజన యానాది కాలనీలో 50, ఆదిఆంధ్రవాడలో 100, దేవసేనాపురంలో 150, రాజులకండ్రిగలో 100 ఇలా సుమారు 850 నుంచి 950 కుటుంబాలు పంచాయతీ మొత్తం మీద ఇక్కడ నివశిస్తున్నాయి. కేబీఆర్‌పురం, రాజులకండ్రిగ మినహా అన్ని గ్రామాల్లోనూ సమస్యలు తాండవిస్తున్నాయి. ప్రత్యేకించి కేబీఆర్‌పురం దళితవాడలో సమస్యలు తిష్ట వేశాయి. కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగు ముందుకు సాగడం లేదు. గ్రామంలో ఉన్న సిమెంట్ రోడ్డుపైనే వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తూ దుర్వాసన వస్తోంది. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయి విషసర్పాలకు నిలయంగా మారింది. దోమలు వృద్ధి చెంది పిల్లలు, వృద్ధులు రోగాల బారిన పడుతున్నారు. సమస్యల పరిష్కారం కోసం సచివాలయం చుట్టూ గ్రామస్తులు ప్రదక్షిణలు చేస్తున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



పేరుకుపోయిన మురుగు నీరు



పాలకవర్గాన్నే పట్టించుకోవడం లేదు

పంచాయతీ అభివృద్ధికి తగిన ప్రతిపాదనలు తయారు చేసి సహకరించాలని కోరుతున్నా కార్యదర్శి అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకవర్గాన్నే పట్టించుకోవడం లేదంటే ఇతరుల గురించి ఇకచెప్పేది ఏముంటుంది?

–షణ్ముగరెడ్డి, ఉప సర్పంచ్, కేబీఆర్‌పురం పంచాయతీ



కార్యదర్శి తీరు బాగోలేదు

గ్రామంలో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదు. ఫొటోల కోసం ఫోజులిచ్చి వెళ్తున్నారు తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదు. ఇందుకు ప్రత్యక్షంగా కనిపిస్తున్న రోడ్లు, డ్రైనేజీలే నిదర్శనం.

–ఇ.విజయ్‌రాజ్, 9వ వార్డు మెంబర్, కేబీఆర్‌పురం



రాత్రిళ్లు కంటిపై కునుకు లేదు

దోమల బెడద ఎక్కువగా ఉంది. రాత్రిళ్లు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. పిల్లలు, పెద్దలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులకు ఉంది. సచివాలయం వద్దకు వెళ్లినా అందుబాటులో ఉండరు. ఏమి చేయాలి?

–మల్లిక, 7వ వార్డు మెంబర్, కేబీఆర్‌పురం

దళితవాడలో సమస్యలు నిజమే

కేబీఆర్‌పురం దళితవాడలో డ్రైనేజీలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అన్నింటిని కొత్తగా ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. కేంద్ర ప్రభుత్వ నిధులతో పారిశుధ్యం, తాగునీరు, ఇతర మెయింటెనెన్స్ పనులను చూస్తున్నాం.

–నరేష్, పంచాయతీ కార్యదర్శి, కేబీఆర్‌పురం

విత్తన శుద్ధి తప్పనిసరి

నింద్ర: రబీలో వరి సాగు చేసే రైతులు నారుమడుల్లో సస్యరక్షణ, విత్తన శుద్ధి చేయడంతో చీడపీడలను నివారించవచ్చునని వ్యవసాయ శాఖాధికారి తులసీరాం తెలిపారు. శనివారం మండలంలోని అగరం, నింద్ర గ్రామాల్లో వరి నారుమడులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ కోసం తప్పనిసరిగా మందులు పిచికారీ చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా గ్రామోత్సవం



తిరుచ్చిపై విహరిస్తున్న శ్రీవారు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంట శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శనివారం వేకువ జామున సుప్రభాత సేవతో శ్రీవారిని మేల్కొలిపి, నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామిని, పట్టు పీతాంబరాలు, విశేష స్వర్ణాభరణాలు, సుగంధ పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, ఊయలలో కొలువుదీర్చారు. భక్తి కీర్తనల నడుమ శ్రీవారి ఊంజల్ సేవ కన్నుల పండుగగా జరిగింది. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరులతో కలిసి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. మేళతాలాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో గ్రామోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులను కటాక్షించి ఆలయం చేరుకున్న స్వామి, అమ్మవార్లకు మంగళహారతులిచ్చి పవళింపు సేవ నిర్వహించారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఘోరం



కృపాలక్ష్మి

పాలసముద్రం: పేద విద్యార్థులకు సైతం మెడికల్ విద్య అందుబాటులోకి రావాలనే లక్ష్యంతో గత వైఎస్‌ఆర్ సీపీ ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలను తీసుకువచ్చిందని, వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలనుకోవడం దారుణమని గంగాధరనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీపీపీ విధానంతో ప్రజల సొమ్మును ప్రణాళికబద్ధంగా లూటీ చేస్తూ పేద బడుగు వర్గాలకు వైద్య విద్యను దూరం చేసే సీఎం చంద్రబాబు విధానాలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చంద్రబాబు హయాంలో పేద వర్గాలకు జరిగిన మేలు ఏమీ లేదన్నారు. వైఎస్‌ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకు వేస్తూ పేద వర్గాలు వైద్య విద్యను అవదుబాటులోకి తెస్తూ 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు తీసుకొచ్చి వాటిని ఏర్పాటు చేయడానికి సంకల్పించారన్నారు. రూ.8450 కోట్లతో చేపట్టిన 17 మెడికల్ కళాశాలల్లో మొదటి దశలో ఐదు మెడికల్ కాలేజీలు పూర్తయ్యాయన్నారు. ఎన్నికల ముందు మరో మూడు కాలేజీలు పూర్తయ్యాయన్నారు. ఏ ఒక్క కళాశాలను తీసుకురాలేని చంద్రబాబు వాటిని ఎలా ప్రైవేటు పరం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. కమీషన్ల కోసమే మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయాలని చూస్తోందని ఆరోపించారు. రైతులకు గత ఐదేళ్లలో ఏనాడూ యూరియా సమస్య రాలేదని పేర్కొన్నారు. ఇప్పుడు యూరియా కోసం భారీగా క్యూలలో ఎందుకు నిలబడాల్సి వస్తోందని ప్రశ్నించారు. తగినంత యూరియా అందుబాటులో ఉంటే రైతులు రోడ్డుపైకి ఎందుకు వస్తారని నిలదీశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పడం ఖాయమని వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు భరోసా





అయ్యప్ప కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, కుమారస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి: అయినవాళ్లను పోగొట్టుకొని, ఆరోగ్యరీత్యా సమస్యలు ఎదుర్కొంటున్న పలువురు వైఎస్‌ఆర్ సీపీ నేతలను మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో పార్టీ స్టేట్ వీవర్ సెల్ కార్యదర్శి అయ్యప్ప తల్లి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందగా శనివారం వారి నివాసానికి వెళ్లిన మాజీ మంత్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నాయకులు ఏజీ మణి, ఏజీ భాస్కర్‌ల తండ్రి ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం కీళపట్టుకు వెళ్లిన ఆమె వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం కుమార్తె ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటుండగా ఆమెను ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. అనంతరం టీఆర్ కండ్రిగలో అనారోగ్యం పాలై చికిత్స పొందుతున్న జిల్లా మున్సిపాలిటీ వింగ్ కార్యదర్శి వెంకటేశులును ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూరల్ మండలం బుగ్గ అగ్రహారం గ్రామంలో పార్టీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగ ప్రధాన కార్యదర్శి కుమారస్వామి సోదరుడు సుధాకర్ ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం దేశూరు అగరం గ్రామంలో అనారోగ్యం పాలై చికిత్స పొందుతున్న ఎంపీటీసీ గుణశేఖర్ రెడ్డి సోదరుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు రామ్మూర్తిరెడ్డి అనారోగ్యం పాలై చికిత్స పొందుతుండగా ఆయనను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఢిల్లీ, నాయకులు కన్నాయిరం, టీసీ మురుగయ్య, యాకోబు, ఎన్‌సీ ఆనంద్‌కుమార్, బుజ్జిరెడ్డి, రవికుమార్, వెంకటరెడ్డి, హరి, గోకుల్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన వేపగుంట విద్యార్థులు



ప్రథమ బహుమతి అందుకున్న విద్యార్థులు



ప్రసంసా పత్రం అందిస్తున్న ఎంఈఓ విజయకుమార్

పుత్తూరు: కళా ఉత్సవ్-2025 ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి పోటీల్లో పుత్తూరు మండలం వేపగుంట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. ఈ నెల 11 నుంచి 12 వరకు రెండు రోజులపాటు కార్వేటినగరం డైట్ కళాశాలలో పోటీలను నిర్వహించారు. పోటీల్లో వేపగుంటకు చెందిన విద్యార్థులు థియేటర్ ఆర్ట్ పోటీల్లో పాల్ యేసుకుమార్, పూజిత, అనుష్క, దీక్షిత బృందం జిల్లా స్థాయి ప్రథమ స్థానం సాధించారు. దీంతో వీరు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పాటల పోటీల్లో సమీరా, సవిత తృతీయ స్థానాలు సాధించారు. ఇన్‌స్ట్రుమెంట్ మ్యూజిక్‌లో జాన్ వెస్లీ, హార్థిక్ ప్రోత్సాహక బహుమతులు గెలుచుకొన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, గైడ్ టీచర్ కరుణాకర్‌ను ఎంపీపీ మునివేలు, గ్రామ సర్పంచ్ గిరిజా ప్రసాద్, టీడీపీ నాయకులు బాలాజీ, పాఠశాల చైర్మన్ బుజ్జిబాబు, కేవీనాయుడు, భాగ్యరాజ్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో 11, 12వ తేదీలలో నిర్వహించిన జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో గంగమాంబాపురం విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు మండల విద్యాశాఖ అధికారి విజయకుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాలలో అభినందన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ పదో తరగతి చదువుతున్న ఆదిత్య, వాసు జిల్లా స్థాయిలో జరిగిన కళాఉత్సవ్ పోటీలలో పాల్గొని, ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడమే కాకుండా పాఠశాల ఉనికిని నిలబెట్టారని కొనియాడారు. అదే విధంగా విదార్థులకు శిక్షణ ఇచ్చిన గుణశేఖర్‌ను కూడా అభినందించారు.

వృద్ధులకు అన్నదానం



భోజనం అందిస్తున్న జైభీమ్ ఫౌండేషన్ సభ్యులు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో జైభీమ్ ఫౌండేషన్ ట్రెజరర్ అనిల్‌కుమార్ కుమారుడు ఎం.అకీరా భీమ్ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని శనివారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ఉపాధ్యాయుడు, జైభీమ్ లీగల్ అడ్వైజర్ గుర్రప్ప మాట్లాడుతూ అంబేడ్కర్ అన్నిమతాలకు ఆదర్శవంతుడని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు పరంధామన్, సెక్రటరీ నరేష్, సభ్యులు ప్రవీణ్‌కుమార్, రాజుకుమార్, ప్రశాంత్ కిరణ్, నవీన్, విమరాజ్, వినయ పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అక్షరంపై అక్రమ కేసులు తగదు



మాట్లాడుతున్న కాలప్ప, వైఎస్‌ఆర్ సీపీ నాయకులు

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం చేసే మోసాలను ప్రజలకు నిర్భయంగా తెలియజేస్తే పత్రికలపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కాలప్ప అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ఇది ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన పత్రిక స్వేచ్ఛను కాలరాయడమేనని అన్నారు. ఎక్కడ అన్యాయం, అవినీతి జరుగుతుందో అక్కడ పత్రిక గర్జిస్తుందని అన్నారు. సాక్షి మీడియాపై కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని అన్నారు. తప్పులను ఎత్తిచూపితే పాత్రికేయులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి జర్నలిస్టులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గంగాధరనెల్లూరు నియోజవర్గంలో నిజాలను నిర్భయంగా రాసే విలేకరులను కూటమి నాయకులు బెదిరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం చేసే అరాచకాన్ని ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో వీరికి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఎంపీపీ సరిత జనార్దన్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు మణి, నాయకులు రమేష్, పేతురు, గిరిబాబు, శివలింగం, అల్లయ్య, కోటి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ రైతుకు సన్మానం



హరికృష్ణారెడ్డిని సన్మానిస్తున్న కెనరా బ్యాంకు అధికారులు

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని దాసరపల్లెకు చెందిన ప్రముఖ కవి, ప్రకృతి రైతు హరికృష్ణారెడ్డిని శనివారం చిత్తూరు కెనరా బ్యాంకు అధికారులు ఘనంగా సన్మానించారు. స్థానిక రాజ మహల్‌లో కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో మెగా రుణ మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ రైతులకు, అభ్యుదయ కష్టమర్లకు పారిశ్రామికవేత్తలకు సన్మానం చేశారు. సృజనాత్మక ఆలోచనలతో పరిశ్రమలు స్థాపించే ఔత్సాహిక పారిశ్రామిక వేత్త హరికృష్ణారెడ్డి ప్రకృతి వ్యవసాయంలో సాధిస్తున్న సేవలను గుర్తించి, సన్మానం చేశారు. హరికృష్ణారెడ్డితోపాటు డీజీఎం రామ్మోహన్, జీఎం అనురాధ, ఇతర అధికారులు హరికృష్ణారెడ్డికి చిన్న తరహా పరిశ్రమ ఏర్పాటు చేయడానికి రుణ మంజూరు పత్రాలు అందించారు. హరికృష్ణారెడ్డిని బ్యాంకు అధికారులు అభినందించారు.

రణభేరి బైక్ జాతా పోస్టర్ విడుదల



విజయపురం: విద్యారంగ ఆర్థిక సమస్య సాధన కోసం యూటీఎఫ్ రణభేరి బైక్ జాతా పోస్టర్‌ను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మణికంఠన్ మండలంలోని గంగమాంబపురం పాఠశాల ఆవరణలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఉపాధ్యాయుల విద్యా రంగ సమస్యలు, ఆర్థిక సమస్యలపై ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి విముక్తి కలిగించడం, పాఠశాల విద్యార్థులకు స్వేచ్ఛ పూరిత వాతావరణంలో బోధన చేయించడం, 12వ పీఆర్‌సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని, సీపీఎఫ్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధాన్ని అమలు చేయాలని, ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్ కల్పించాలని డీఏ, ఆర్థిక బకాయిలపై యూటీఎఫ్ ప్రారంభించిన రణభేరి జాతరను ఉపాధ్యాయులంతా పాల్గొనాలని కోరారు. సోమవారం సాయంత్రం 4గంటలకు ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ నుంచి నగరి ఓం శక్తి గుడి వరకు రణభేరి ప్రారంభమవుతుందని తెలిపారు. నగరి డివిజినల్ ఉపాధ్యాయులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పుత్తూరులో 214 కేసులు పరిష్కారం

- మూడు జంటలను ఒక్కటి చేసిన న్యాయమూర్తులు



బలరామ్, రంజిత జంటతో న్యాయమూర్తులు

పుత్తూరు: స్థానిక సబ్ కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మొత్తం 214 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్.సి.రాఘవేంద్ర తెలిపారు. కక్షిదారుల మధ్య రూ.79,79,490 రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 182 క్రిమినల్ కేసులు, 18 సివిల్, 14 ప్రీలిటిగేషన్ కేసులను పరిష్కరించినట్లు వివరించారు. ఇందులో విడాకుల కోసం కోర్టుకు ఎక్కిన మూడు జంటలకు న్యాయమూర్తులు కౌన్సెలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు. ఇలా విడిపోవాలనుకుని ఒక్కటైన జంటల్లో నారాయణవనం మండలం కొండల్ చెరువు గ్రామానికి చెందిన ఎం.బలరామన్, రంజిత, నెల్లూరు జిల్లా కావలి పట్టణానికి చెందిన శేఖర్, పల్లవి, పుత్తూరు మండలం నందిమంగళం గ్రామానికి చెందిన వెంకటేష్, రాసాతి దంపతులు ఉన్నారు. వీరందరితో కోర్టులో పూలదండలు వేయించి కలసి జీవించేలా సూచించారు. లోక్ అదాలత్ ప్రిసీడింగ్ ఆఫీసర్లుగా సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సి.జానకి, అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి వ్యవహరించారు. బెంచ్ మెంబర్లుగా న్యాయవాదులు మురళి, అమర్‌నాథ్, నదియ వ్యవహరించారు. పోలీసులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.